ఎస్‌బీ ఎంక్వయిరీ ఆఫీసర్ అవతారం

- ఉద్యోగాల పేరుతో డబ్బుల వసూలు చేస్తున్న హోంగార్డు
- చర్యలు తీసుకోవాలంటున్న మండల ప్రజలు

బాధిత రైతు ప్రభాకర్‌రావు

నల్లబెల్లి, మే 31: స్పెషల్ బ్రాంచ్ పోలీస్ ఎంక్వయిరీ ఆఫీసర్ అవతారమెత్తిన ఓ హోంగార్డు ఊరూరా తిరుగుతూ డబ్బులు వసూలు చేస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధిత రైతు కథనం ప్రకారం.. మండలంలోని రేలకుంట గ్రామానికి చెందిన సిద్దూరి ప్రభాకర్‌రావుకు అదే గ్రామానికి చెందిన మరో రైతుతో భూ వివాదం ఉంది. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ కేసు విచారణలో ఉంది. స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ హోంగార్డు ఐదు నెలల క్రితం జిల్లా ఎస్‌బీ కార్యాలయానికి బదిలీపై వెళ్లాడు. ఇతడు నాన్ డ్యూటీలో ఉన్నప్పుడు రేలకుంట గ్రామానికి వెళ్లి ప్రభాకర్‌రావును కలిశాడు. తాను ఎస్‌బీ ఎంక్వయిరీ ఆఫీసర్‌గా వచ్చానని, భూ వివాదంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు మీ వద్ద ఎన్ని డబ్బులు తీసుకున్నారని అడిగాడు. తాను ఎవరికీ డబ్బులు ఇవ్వలేదుని, భూ సమస్యను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని స్థానిక పోలీసులు తమకు సూచించినట్లు ప్రభాకర్‌రావు అతడితో అన్నాడు. అధికారులకు ఎన్ని డబ్బులు ఇచ్చావో తనకు తెలియజేయాల్సిందేనని హోంగార్డు బాధిత రైతును ఇబ్బంది పెట్టాడు. ఇదిలా ఉంటే.. ఇదే హోంగార్డు మండలంలోని పలువురి వద్ద హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా డ్యూటీ లేని సమయంలో మండలంలోని పలు గ్రామాలకు వెళ్తూ ఎస్‌బీ ఆఫీసర్ అంటూ గుడుంబా కేంద్రాలు, ఫర్నిచర్ తయారీదారుల వద్ద నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి హోంగార్డుపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీ ఎంక్వాయిరీ ఆఫీసర్ పేరుతో తనను, తన కుటుంబాన్ని వేధిస్తున్న హోంగార్డుపై చర్యలు తీసుకోవాలని రైతు సిద్దూరి రత్నాకర్‌రావు ఉన్నాతాధికారులను కోరాడు.

డీఆర్‌ఎస్ కార్యాలయంలో బోటును పరిశీలిస్తున్న మేయర్

డీఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్, మే 31: వర్షాకాలం నేపథ్యంలో డీఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. నక్కలగుట్ట సర్కిల్ ఆవరణలోని డీఆర్‌ఎఫ్ కార్యాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. వర్షాకాలంలో వినియోగించే బోటులను పరిశీలించారు. అక్కడ బల్దియా నిర్వహణలోని నర్సరీని పరిశీలించారు. వనమహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, ఈఈలు రవికుమార్, మాధవీలత, ఏసీపీ రజిత, డీఈ రాజ్‌కుమార్, టీపీఎస్ రోజారాణి పాల్గొన్నారు.

రైల్వేట్రాక్ వైపు డ్రైన్‌ను పూర్తి చేయాలి

వరంగల్ రైల్వే ట్రాక్ పక్కన నుంచి 12 మోరీలకు కలిసే డ్రైన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ సుధారాణి అధికారులను ఆదేశించారు. కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి ఆమె వరంగల్ 28, 29 డివిజన్‌లోని పాతబీటుబజార్, మేదరి బస్తీ వరకు ఉన్న డ్రైనేజీని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముంపు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఏసీపీ శ్రీనివాస్, టీపీఎస్ శ్రీకాంత్, ఏఈ ముజామిల్ పాల్గొన్నారు.

'ప్రత్యేక' పాలనలో పంచాయతీలు అస్తవ్యస్తం

- అప్పుల ఊబిలో గ్రామ కార్యదర్శులు
- అభివృద్ధి పనులకు నిధులు కరువు
- పెట్టిన ఖర్చులు ఇప్పించాలని గ్రామాధికారుల వేడుకోలు

ఖిలావరంగల్, మే 31: కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాలకు గ్రాంట్లు రాకపోవడంతో జీపీలు ఆర్థికంగా చతికిలపడ్డాయి. ఏదైనా అత్యవసర పని ఉంటే పంచాయతీ కార్యదర్శులే తమ జేబుల్లోంచి డబ్బు ఖర్చు పెట్టి మరమ్మతులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం, గ్రామాల్లో పాలక వర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామ పంచాయతీల పాలన కార్యదర్శులకు దినదిన గండంగా మారింది. ఏ చిన్న పని చేసినా తమ వేతనాల నుంచి ఖర్చు చేసి అప్పుల పాలవుతున్నామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక భారంతో కార్యదర్శులు

గ్రామాలు దేశానికి పట్టుగొమ్మలు అనే నానుడి నేడు జిల్లాలో కనిపించడం లేదు. పాలకవర్గం ఉన్నప్పుడు ఏ పని కావాలన్నా సర్పంచ్‌లు ముందుగా వారి జేబులోంచి ఖర్చు చేసి, తర్వాత బిల్లులు డ్రా చేసుకునేవారు. వారి పదవీ కాలం ముగిసిన తర్వాత ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనను అమల్లోకి తెచ్చింది. సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయిన తర్వాత ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం ఆర్థిక సంఘం గ్రాంటును నిలిపివేసింది. దీంతో ఆర్థిక భారం కార్యదర్శులపై పడింది. పారిశుధ్య పనులు, సింగిల్ ఫేజ్ మోటర్లకు ట్యాంకులు అమర్చడం, బ్లీచింగ్ ఫౌడర్ కొనుగోలు, వీధిదీపాల నిర్వహణ తదితర పనులకు కార్యదర్శులే సొంతంగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో 315 చిన్న, పెద్ద గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటి వరకు చిన్న గ్రామ పంచాయతీలకు సుమారు రూ. లక్ష, పెద్ద గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 5 లక్షల వరకు బకాయిలు ఉన్నట్లు తెలిసింది. ఒక్కో కార్యదర్శి నెలకు రూ. 10 వేలు నుంచి రూ. 20 వేల వరకు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. కార్యదర్శుల ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకోకుండా జిల్లా అధికార యంత్రాంగం నయా పైసా విడుదల చేయకుండా స్వచ్ఛదనం–పచ్చదనం విజయవంతం చేయాలంటూ కార్యదర్శుల మెడపై కత్తిపెట్టి పని చేయించిందనే విమర్శలు న్నాయి.

ఆర్థికభారం నుంచి విముక్తి కల్పించాలి

గ్రామ పంచాయతీల నిర్వహణకు వెంటనే నిధులు విడుదల చేసి కార్యదర్శులకు ఆర్థికభారం నుంచి విముక్తి కల్పించాలి. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి. ప్రభుత్వం ఏ శాఖలో లేనివిధంగా ఫేసియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ పెట్టి కార్యదర్శులను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలి.

– గుగులోత్ యాకూబ్‌నాయక్, కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు

నల్లబెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆర్థిక వెసులుబాటు కల్పించాలని వినతి

కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఆర్థిక వెసులుబాటు కల్పించాలని కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో గతంలో ఉన్నతాధికారులను కలిసి విన్నవించారు. అయినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అక్టోబర్ నుంచి ఆదివారాలు, సెలవులు, పండుగలు అనే తేడా లేకుండా పనులు చేయించడంతో కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నారు. సొంతంగా జేబుల నుంచి పెట్టిన డబ్బులు ఇప్పించాలని అధికారులు, ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఆడంభరంగా ఆవిర్భావ వేడుకలు : పెద్ది



నల్లబెల్లి, మే 31: నర్సంపేట నియోజకవర్గంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఆడంభరంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. డల్లాస్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 14 ఏళ్లపాటు అలుపెరుగని పోరాటంలో ఉద్యమ రథసారథి కేసీఆర్ సారథ్యంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జూన్ 2న నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని సూచించారు. అలాగే, అన్ని బీఆర్‌ఎస్ కార్యాలయాలు, మున్సిపాలిటీలు, మండలకేంద్రాల్లో జాతీయ పతాకంతోపాటు గులాబీ జెండాలను ఎగరవేయాలని కోరారు. ఆవిర్భావ సంబురాల్లో పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, పార్టీ శ్రేణులు, తెలంగాణవాదులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వీరస్వామికి నివాళులర్పిస్తున్న పెద్ది స్వప్న

జర్నలిస్టు కుటుంబానికి పరామర్శ

దుగ్గొండి, మే 31: మండలకేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బైగాని వీరస్వామి(76) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న శనివారం గ్రామానికి చేరుకొని వీరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకులు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిళి, పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ కాట్ల కోమలాభద్రయ్య, కంచరకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏ బాబు, సీపీఎం నాయకులు బాబు, బీ రవీందర్ పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

సంగెం, మే 31: వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గవిచర్లకు చెందిన పెండ్లి సాయమ్మ(72) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఎంతకూ ఆరోగ్యం కుదటపడకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె శనివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమార్తె తుత్తురు రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. అలాగే, గ్రామానికి చెందిన కందుల సరోజన(58) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఎంతకీ తగ్గకపోవడంతో శనివారం సాయంత్రం బాత్‌రూమ్‌లో చీరెతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'అగ్రకులాలకు పది శాతం రిజర్వేషన్ అన్యాయం'

పోచమ్మమైదాన్, మే 31: పది శాతం లేని అగ్ర కులాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించి, బీసీలకు తీరని అన్యాయం చేస్తున్నారని బీసీ హక్కుల సాధన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. పది శాతం లేని అగ్రకులాలకు విద్య, ఉద్యోగాల్లో కేంద్ర ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నందున దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. 53 శాతం ఉన్న బీసీలకు కేవలం 27 శాతం రిజర్వేషన్ వర్తింపజేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలని దేశవ్యాప్తంగా బీసీ సంఘాలు ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోని ప్రధానమంత్రి మోదీ అగ్రకుల పేదల కోసమని ఆఘమేఘాల మీద పది శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని విమర్శించారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, మహిళా రిజర్వేషన్లలో బీసీ కోటా నిర్ణయించాలని ఆయన కోరారు. వెంటనే కులగణన ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

రేపు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

పోచమ్మమైదాన్, మే 31: అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో జూన్ 2 సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ భవన్‌లో 11వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు వరంగల్‌కు చెందిన ప్రముఖ కవి, రచయిత, సంఘం అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య రాములు, ఇప్టా జాతీయ ఉపాధ్యక్షుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే కవి సమ్మేళనంలో పలు జిల్లాలకు చెందిన 22 మంది కవులు పాల్గొంటారని, అధిక సంఖ్యలో సాహితీవేత్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని ఇంటికొచ్చిన జవాన్‌కు సన్మానం

పర్వతగిరి, మే 31: పహల్గాం ఘటన తర్వాత ఆపరేషన్ సింధూర్‌లో భాగస్వామ్యమై దూపతండాకు చెందిన బానోత్ మోహన్‌కు శనివారం ఘన స్వాగతం లభించింది. మండలంలోని దూపతండాకు చెందిన బానోత్ మోహన్ ఐటీబీపీ జవాన్‌గా కశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. పహల్గాం దుర్ఘటనకు ముందు సెలవుపై ఇంటికి వచ్చాడు. కశ్మీర్ హెడ్‌క్వార్టర్ నుంచి అర్జెంట్‌గా రావాలని మెసేజ్ వచ్చిన వెంటనే డ్యూటీకి వెళ్లి ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా అతడిని దూపతండా మాజీ సర్పంచ్ ధర్మసోత్ జామిరి, స్థానిక నాయకులు ధరంసోత్ దూల్యా, రమేశ్, యాకూబ్, మహేందర్ తదితరులు మోహన్‌కు పూలమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు.

ఎంజీఎంహెచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



వరంగల్‌చౌరస్తా, మే 3: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎంజీఎం హాస్పిటల్ ఆవరణలో శనివారం మధ్యాహ్నం జరిగింది. అత్యవసర విభాగం ముందున్న రేకుల షెడ్ కింద కదలకుండా పడి ఉన్న వ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. ఔట్‌పోస్టు సిబ్బంది ద్వారా మట్టెవాడ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు సుమారు 40 ఏళ్ల వయస్సు, 5 అడుగుల ఎత్తు, నల్లని జుట్టు కలిగి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎంహెచ్ మార్చురీలో భద్రపరిచామని, సంబంధీకులు 7812685005 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లాలో 31.2 మి.మీ సగటు వర్షపాతం నమోదు

ఖిలావరంగల్, మే 31: జిల్లాలో శుక్రవారం రాత్రి 31.2 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అత్యధికంగా ఖానాపురంలో 60.8, అత్యల్పంగా రాయపర్తిలో 5.8 మి.మీ వర్షం కురిసింది. అలాగే, సంగెంలో 60.0, గీసుగొండలో 41.4, వరంగల్‌లో 37.4, నర్సంపేటలో 36.4, చెన్నారావుపేటలో 33.8, ఖిలావరంగల్‌లో 31.2, దుగ్గొండిలో 29.6, నెక్కొండలో 25.8, నల్లబెల్లిలో 22 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ పేర్కొంది.

3 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ఖిలావరంగల్, మే 31: జిల్లాలోని వర్ధన్నపేట మండలం మినహా అన్ని మండలాల్లోని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 3 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించే సదస్సులను రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

సాగు పనులు షురూ..

గీసుగొండ, మే 31: ఇటీవలి నుంచి కురుస్తున్న వర్షాలతో మండలవ్యాప్తంగా రైతులు సాగు పనులు ప్రారంభించారు. మే నెల చివరి వారంలోనే వర్షాలు పడడంతో రైతులు ముందస్తుగా దుక్కులు సిద్ధం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో శనివారం రైతులు పత్తి విత్తనాలు నాటారు. ఎక్కడ చూసినా రైతులు పంట చేలల్లో విత్తనాలు నాటుతూ కనిపించారు. పలువురు రైతులు మక్కజొన్న పంట సాగు చేస్తున్నారు.

నందనాయక్‌తండాలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబ

పొగ తాగడం ఆరోగ్యం, పర్యావరణానికి హానికరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

నయింనగర్, మే 31 : పొగ తాగడం వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చేపడమే కాకుండా పర్యావరణానికి హాని కలిగిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ అన్నారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థలు సంయుక్తంగా న్యాయ సేవా సదన్ బిల్డింగ్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ హాజరై మాట్లాడుతూ.. పొగాకు వినియోగదారుల్లో అవగాహన కల్పించడం, మానేసేందుకు సలహాలు ఇవ్వాలన్నారు. పొగాకు వాడాలనే కోరికను అధిగమించడానికి వ్యాయామం, ఒత్తిడిని తగ్గించడానికి యోగ, సంగీతం వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి అపర్ణాదేవి, వరంగల్ జిల్లా బార్ అధ్యక్షుడు వలుస సుధీర్, న్యాయ సేవా సంస్థ కార్యదర్శులు సాయి కుమార్, క్షమాదేశ్ పాండే పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

దుగ్గొండి: పొగాకు ఉత్పత్తుల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఐ.ప్రకాశ్ అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. అంబర్, గుట్కా తినడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ధూమపానం, మద్యపానం వల్ల కలిగే దుష్ప్రభావాలను వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్లు రవీంద్ర, అర్చన, ఆచార్య, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, వాసంతి, సోమేశ్, సిబ్బంది భరత్, హుస్సేన్, వనమాల, సలోమి, సాంబయ్య, సంధ్యారాణి, రహమాన్, చానక్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

తృణధాన్యాల పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కన్న బాబు

మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ కన్న బాబు

పర్వతగిరి, మే 31: వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏనుగల్లు శివారు గుగులోత్ తండాలో శనివారం పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయ పరిధిలోని మామునూరు కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తృణధాన్యాల పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కన్నబాబు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా వల్ల ఆహార ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిందన్నారు. మార్కెట్‌లో ఆహార కొరతను తీర్చేందుకు అధిక దిగుబడి కోసం ఎరువులు, క్రిమిసంహారక మం దులు విచ్చలవిడిగా వాడుతుండడంతో నేల కలుషితం అవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల భూసారం దెబ్బతినడంతోపాటు పంటలకు మేలు చేసే క్రిమికీటకాలు చనిపోతున్నాయని, దీంతో తెగుళ్ల ఉధృతి పెరుగుతున్నదన్నారు. సేంద్రియ సాగు చేయడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గి రైతుల నికర ఆదాయాన్ని పెంచవచ్చని వివరించారు. సదస్సులో కేంద్రీయ మెట్ట పంటల శాస్త్రవేత్త నిర్మల, కేవీకే శాస్త్రవేత్త సౌమ్య, హర్ష, ఏవో టీవీఆర్ఆర్ ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ పాలనలోనే పెరిగిన పేదరికం, నిరుద్యోగం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ పల్లి శ్రీనివాసరావు

మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

వరంగల్‌చౌరస్తా, మే 31: పదేళ్ల మోదీ పాలనలో దేశవ్యాప్తంగా పేదరికం, నిరుద్యోగం పెరిగిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శివనగర్ తమ్మెర భవన్‌లో గన్నారపు రమేశ్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడానికే మోదీ దృష్టి పెడుతున్నారే తప్ప పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైట్ ఆఫ్ లోన్స్ పేరుతో కార్పొరేట్ సంస్థలకు చెందిన 16 లక్షల 35 వేల కోట్ల రూపాయలను రద్దు చేయడాన్ని ఆయన ఆపేక్షించారు. జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు వ్యవసాయ పెట్టుబడికి రెట్టింపు ఖర్చు ఇచ్చినప్పుడే మద్దతు ధర లభిస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి మేకల రవి మాట్లాడుతూ జూలై 30, 31న నిర్వహించనున్న సీపీఐ జిల్లా సదస్సులను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న మెపా నాయకులు

దుగ్గొండి, మే 31: ఇటీవల అనారోగ్యంతో మండలంలోని రేఖంపల్లికి చెందిన యాట రవి మరణించాడు. విషయం తెలుసుకున్న మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పి.దేవేందర్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. అనంతరం రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మెపా నాయకులు నీరటి మురళి, దండు భిక్షపతి, మేక నవీన్, జెట్టబోయిన రాజేందర్, సంకెళ్ల స్వామి, పొన్నం సాంబయ్య, శ్రీకాంత్, తిరుపతి, శ్రీనివాస్, నరేశ్, శ్రావణ్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం

పర్వతగిరి: మండలంలోని సోమారం గుంటూరుపల్లికి చెందిన తాటికాయల ఉపేందర్ కుమారుడు రామకృష్ణ మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో మహా ఆది సేవా సమితి(మాస్) ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మాస్ సంస్థ బాధ్యులు డాక్టర్ విజయ్‌కుమార్ సీనపల్లి, డాక్టర్ రవికిరణ్ చాగంటి, డాక్టర్ విక్రమ్‌కుమార్ సీనపల్లి, వరంగల్, మహబూబాబాద్ ఆరోగ్యశ్రీ టీం లీడర్ కందికట్ల సంతోష్ మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నినాదం 'పే బ్యాక్ టు ది సొసైటీ'లో భాగంగా ఎస్సీల్లోని నిరుపేద విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ నిరుపేద విద్యార్థులు 9010730380 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త జి.వీరన్న

సాగులో మెళకువలు పాటించాలి

దుగ్గొండి, మే 31: వానకాలం సాగులో రైతులు మెళకువలు పాటించి అధిక దిగుబడి సాధించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు జి.వీరన్న, ఆర్.శ్రావణ్‌కుమార్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని మల్లంపల్లి రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. సాగులో యూరియా వాడకం తగ్గించాలని, పంట మార్పిడి వల్ల అధిక దిగుబడి పొందాలన్నారు. పత్తి సాగులో అధిక దిగుబడి సాధించేలా మెలుకువలు పాటించాలని, వరి పంటలో మొగిపురుగు, తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో విధిగా రసీదు తీసుకొని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో బి.మాధవి, ఏఈవో రాజేశ్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

నల్లబెల్లి, మే 31: సన్న బియ్యం పంపిణీలో రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ముప్పు కృష్ణ హెచ్చరించారు. లబ్ధిదారులకు మూడు నెలల సన్న బియ్యం జూన్ మొదటి వారంలో పంపిణీ చేయనున్న నేపథ్యంలో తహసీల్దార్ తన కార్యాలయంలో శనివారం డీలర్లతో సమీక్షించారు. కార్డుదారులకు ఒకే దఫా మూడు నెలల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నందున డీలర్లు ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు.

రాణి అహిల్యాబాయి జయంతి వేడుకలు

కరీమాబాద్, మే 31: రాణి అహిల్యాబాయి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఎస్ఆర్ఆర్‌తోటలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాణి అహిల్యాబాయి చిత్రపటానికి పూలమాల వేసి, ఆమె సేవలను కొనియాడారు.

అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు చర్యలు

నల్లబెల్లి, మే 31: అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డీఈ పి.తిరుపతి అన్నారు. నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం బిగించారు. డీఈ పనులను పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రధానంగా మిషన్ భగీరథ(వాటర్ గ్రిడ్), ప్రభుత్వ దవాఖానలకు నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేసేందుకు అదనపు లైన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రత్యామ్నాయ ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు యుద్ధప్రాదిపదికన పనులు చేస్తున్నట్లు వివరించారు. సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ఖిలావరంగల్, మే 31: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా ఉత్సవాలకు హాజరవుతారన్నారు. వేదిక, సంక్షేమ శాఖ స్టాళ్లు, శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు పాల్గొన్నారు.

పద్మశ్రీ మంద కృష్ణకు ఘన స్వాగతం

ఖిలావరంగల్, మే 31: పద్మశ్రీ అవార్డు అందుకొని తొలిసారిగా వరంగల్‌కు వచ్చిన మంద కృష్ణమాదిగకు శనివారం రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులతోపాటు దళిత సంఘాలు, అభిమానులు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన ర్యాలీ వరంగల్‌చౌరస్తా, పోచమ్మమైదాన్ మీదుగా కొనసాగింది.


మంద కృష్ణమాదిగకు స్వాగతం పలుకుతున్న నాయకులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455. NTW-337056

PLOT FOR SALE
★Hnk గోపాలపూర్ భద్రకాళి కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఈస్ట్ ఫేసింగ్ 300 స్క్వేర్ యార్డ్స్ 30 ఫీట్ల రోడ్డు మంచి వాస్తు క్లియర్ టైటిల్ గల ప్లాటు అమ్మబడును No Brokers cont : 8790501225 and 99499 12347. NTW-337079
★ మడికొండ to రాంపూర్ HYD హైవే కపిల్‌పుడ్స్ ఎదురుగా 1210 గజాల రిజిస్టర్డ్ మరియు నాలా కన్వర్జేషన్ గల ప్లాటు అమ్మబడును. సంప్ర: 9346434041. NTW-4105

కిరాయికి ఇవ్వబడును
★ వరంగల్ శివనగర్ (పద్మశాలి కళ్యాణ మండపం దగ్గర 2 పోర్షన్ (2 బెడ్ రూమ్‌లు+కిచెన్+హా) ఇల్లు కిరాయికి ఇవ్వబడును. విశాలమైన ప్లేస్ కూడా కలిగి ఉన్నది. సంప్ర: సెల్: 9492180497. NTW-000

WATER PROOFING
★శ్రీ వెంకటేశ్వర వాటర్ ప్రూఫింగ్: వాటర్ లీకేజీ టెక్నిషియన్ నిర్ధారించి చేయబడును. ఓల్డ్ & న్యూ బిల్డింగ్ సొల్యూషన్స్- SS కన్స్ట్రక్షన్స్, Wgl.ప్రో. శ్రీకాంత్ 9014012652. NTW-336940

WANTED
★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788. NT-325337-All

WANTED
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883. NT-325336

FINANCE
★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468. NT-350515-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565